క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలోని భుజంగేశ్వర ఆలయం ధ్వజ స్తంభ ప్రతిష్ట, పూజలు వైభవంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో వేదపండితులు మొదటిరోజు, కళశస్థాపన, గణపతిపూజ, కంకణ ధారణ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఈఓ కొండారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో మండల కొండయ్య, మండల ప్రవీణ్ భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి


మాట్లాడుతున్న డాక్టర్ తౌషిఫ్

పెనగలూరు: మండలంలో ఇంటింటి సర్వే నిర్వహించాలని డాక్టర్ తౌషిఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో త్వరలోనే మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమం ప్రారంభం కాబోతుందని తెలిపారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. సర్వే చేసినట్లు ఆధారాలు సమర్పించాలన్నారు. గర్భిణులకు అన్ని రకాల సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సురేంద్రరాజు, పీహెచ్ఎన్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


నిర్మలగిరి కాలనీలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసిన వైద్యులు

సిద్దవటం: మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని నిర్మలగిరి కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 104 సంచార వాహనం చికిత్సలో భాగంగా మాధవరం పీహెచ్‌సీ సిబ్బంది గ్రామస్తులకు వైద్య చికిత్సలు చేసి, గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాత, ఆర్‌డబ్ల్యూఏఈ గురుప్రసాద్, ఎంపీహెచ్ఈఓ నాగవల్లి పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సిద్దవటం: మండలంలో ఉచిత ఇసుక పాలసీ అమలు కాలేదని భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం తహసీల్దారు మురాషావలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గృహనిర్మాణాలకు ఉచిత ఇసుక పాలసీపై తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాలేదన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన విక్రమ్

రాజంపేట: కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని ఊటుకూరు(రాజంపేట) మలుపు వద్ద లారీ ఢీ కొని రాజంపేటలోని సత్య షోరూం మేనేజర్ తుర్రా విక్రమ్ తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు పక్కన స్కూటర్ నిలబెట్టి మాట్లాడుతున్న విక్రమ్‌ను తిరుపతి నుంచి బళ్లారికి వెళుతున్న లారీ ఢీ కొట్టింది. చికిత్స నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని వీబీఆర్ కండ్రిక ప్రభుత్వ పాఠశాలలో 10 తరగతి చదివి పాలిటెక్నిక్‌లో సీటు సాధించిన విద్యార్థి గణేష్‌కు శుక్రవారం నేత్ర ఫౌండేషన్ నిర్వాహకులు చాపల నేతాజి రూ. 12,000 రూపాయల నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. అలాగే ట్రిపుల్‌ఐటీలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ విద్యార్థులకు ప్రోత్సాహం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అపరాజిత, ఉపాధ్యాయులు మధుసూధన్‌రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల వంట..!

- అందని మధ్యాహ్న భోజన బిల్లులు
- నెలనెలా వేతనాలు రాక ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న నిర్వాహకులు
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం కరువు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి రేపటి సమాజానికి ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిధుల కొరత వెంటాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతినెలా బిల్లులు అందక పోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు.


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యకు పెద్దపీట వేశారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడికే పంపించేలా అన్ని వసతులు కల్పించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్న భోజనానికి నిత్యవసరాల ధరలు మండిపోతుండడంతో నిర్వాహకులకు వంట పెనుభారంగా మారింది. నిర్వాహకులకు సమయానికి బిల్లులు అందకపోవడంతో మరింత ఇబ్బందిగా మారింది.

బకాయిలతో ఇబ్బందులు

సకాలంలో బకాయిలు మంజూరుకాక మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వంట మనిషి, హెల్పర్ నుంచి విద్యార్థుల వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులు చవిచూస్తున్నారు. భోజన నాణ్యతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నిర్వహణ లోపాలను అధికారులు ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. నెలల తరబడి కోట్లాది రూపాయలు బిల్లులు అందకపోవడంపై ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు సోమవారం పొంగల్, గుడ్డు, చిక్కీ, మంగళవారం పులిహోరా, టమాటా చట్నీ, దొండకాయ, గుడ్డు, బుధవారం వెజిటబుల్ రైస్, ఆలుకుర్మా,

మండల వ్యాప్తంగా మొత్తం పాఠశాలలు		
ప్రాథమిక పాఠశాలు	:	62
ప్రాథమికోన్నత	:	3
జెడ్పీ ఉన్నత పాఠశాలలు	:	10
కేజీబీవీ	:	1
సోషియల్‌వెల్ఫేర్	:	1
ఆదర్శ పాఠశాల	:	1
మొత్తం విద్యార్థులు	:	4005
ఉపాధ్యాయులు	:	259

గుడ్డు, చిక్కీ, గురువారం సాంబార్‌బాత్, ఎగ్, శుక్రవారం అన్నం, ఆకుకూరపప్పు, గుడ్డు, చిక్కీ, శనివారం పొంగల్, పప్పుచారు పెట్టాలి. ఇందుకోసం ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ. 5.88 పైసలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8 నిర్వాహకులకు అందిస్తున్నారు. అయితే ఇప్పుడు నిత్యావసర వస్తువులు, కూరగాయ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఖర్చు పెరిగి ప్రభుత్వం ఇచ్చే డబ్బులు చాలడం లేదు నిర్వాహకులు వాపోతున్నారు.

విద్యార్థుల అవస్థలు

ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక కంపు కొడుతున్నాయి. కొన్నింటిని వాడుకుండా తాళాలు వేశారు. ఫలితంగా పిల్లలు ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

తరగతి గదులు అందుబాటులోకి తేవాలి



మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలలో నాడు- నేడు పనులు నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలలో తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేసి తరగతి గదులను అందుబాటులోకి తెవాలి. – శ్రీనివాసులు, ఏఈఓ-2, సంబేపల్లె మండలం

అంకిత భావంతో చదవాలి


విద్యార్థులతో మానవత సేవా సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్ : విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో చదవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని రాయచోటి మానవత సేవా సంస్థ అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్ బాషా, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి - సుండుపల్లె రోడ్డులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు నైతిక విలువలు అనే అంశంపై వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిన విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వీరు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నైతిక విలువలు, సమాజ సేవ పట్ల అవగాహన కల్పించుకొని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ప్రిన్సిపాల్ రేఖ, మానవత సేవా సంస్థ సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెంకటరమణ, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, మండల కన్వీనర్ చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లె వెంకటేష్, డైరెక్టర్ రామంద్రారెడ్డి, మురళీ మోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రనాథ్

పుల్లంపేట: సీపీఎస్ ఉపాధ్యాయులకు రెండు నెలలు డీఏ, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బి. నరేంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ పుల్లంపేట మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రనాథ్ మాట్లాడుతూ పీఆర్‌సీ ప్రకటన ఆలస్యం కానున్న నేపథ్యంలో 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సత్తార్ హుస్సేన్, సిద్దయ్య, శివరాం ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను సందర్శించిన విద్యార్థులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుల్లంపేట: మండలంలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 4,5వ తరగతుల విద్యార్థులు శుక్రవారం పుల్లంపేట మండలంలోని వివిధ ప్రభుత్వ సంస్థలను సందర్శించారు. మనకు ఎవరు సేవ చేస్తారనే పాఠ్యాంశంలో భాగంగా పుల్లంపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి అధికారి కార్యాలయం, స్త్రీ శక్తి భవనం, మండల వనరుల కేంద్రం, గ్రంథాలయం, పోస్టాఫీసు తదితర ప్రభుత్వ సంస్థలను సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు. సిబ్బంది సేవలు ఎలా ఉంటాయో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి


ఆర్‌ఐ మానసకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్: నియోజకవర్గంలోని ఇల్లు లేని దివ్యాంగులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ కోరారు. శుక్రవారం స్థానిక తాహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్‌ఐ మానసకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 300 మంది వరకు దివ్యాంగులు ఉన్నారని వారందరికీ కాలనీ ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే దివ్యాంగులకు సదరన్ సర్టిఫికేట్‌లు కోడూరు ఆస్పత్రిలోనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య, ప్రకాష్, ఇంద్రమ్మ, శ్రీను, అరుణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


మెమెంటోలతో క్రీడాకారులను సత్కరించిన హెచ్ఎం భారతి

రాజంపేట టౌన్: రాష్ట్రస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలకు మండలంలోని బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను శుక్రవారం పాఠశాల హెచ్ఎం కె.భారతి మెమెంటోలతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖోఖోలో తొమ్మిదవ తరగతి విద్యార్థి జె.ఉదయ్‌కుమార్, ఏడవ తరగతి చదువుతున్న ఎస్.ఆర్షియాలు ఇటీవల చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె హైస్కూల్‌లో జరిగిన అండర్-14 విభాగంలో విశేష ప్రతిభకనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. అలాగే అండర్-14 విభాగంలో తొమ్మిదవ తరగతికి విద్యార్థి ప్రణతి జిల్లాస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయిందని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఈశ్వర్‌నాయక్ విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడం వల్ల తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

పుల్లంపేట: మండల పరిధిలోని పీవీజీపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మందా దివ్య అడర్-17 కబడీ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శివశంకర్ రాజు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న ఏపీజీబీ మేనేజర్ శ్రీవాణి

సిద్దవటం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఉప్పరపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీవాణి అన్నారు. సిద్దవటం మండలంలోని పార్వతీపురం గ్రామంలోని ఎస్‌పీబీవీడీ సభా హైస్కూల్‌లో శుక్రవారం ఆమె పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. చెట్ల వలన ఎన్నో ప్రయోజనాలు, ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు.

డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి

పుల్లంపేట: డ్వాక్రా మహిళలు సభ్యులుగా ఏర్పడి ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సంఘాలు అభివృద్ధి చెందాలని ఏరియా కో-ఆర్డినేటర్ మల్లికార్జున అన్నారు. శుక్రవారం పుల్లంపేట వెలుగు కార్యాలయంలో మండల సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకున్నారు. మండల సమైక్య అధ్యక్షురాలుగా ఎస్. అనుష, కార్యదర్శి ఏ. దివ్య, కోశాధికారిగా ఎస్ గుల్జార్ ఎన్నికయ్యారు.

అమ్మవారికి రాహుకాల పూజ

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం రంగురంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. పూజల్లో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

చరిత్రకు ప్రతిబింబాలు వేమన పద్యాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రెడ్డి సేవాసమితి సభ్యులు

నందలూరు: వేమన పద్యాలు అలనాటి చారిత్రక, సాంస్కృతిక విషయాలను ప్రతిబింబిస్తాయని కడప రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు నాగిరెడ్డి కొనియాడారు. ప్రజాకవి వేమన జయంతిని పురస్కరించుకొని ఉమ్మడి కడప జిల్లా రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వేమన పద్య పోటీలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం నాగిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 10న ఆదివారం ఉదయం రాజంపేట పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో వేమన పద్యపోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15 సంవత్సరాలు లోపు వయస్సుగల విద్యార్థులు కరపత్రంలో పేర్కొన్న 12 పద్యాలను వరుస క్రమంలో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప రెడ్డి సేవాసమితి కోశాధికారి ఆదినారాయణ రెడ్డి, సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, శిల్పి ఆనందాచారి, రవిశంకర్ రెడ్డి, తులసి స్వర్ణలత, జ్యోతి ప్రియ పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట అరుంధతికాలనీలో మాతమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మాతమ్మ తల్లి ఆలయ గోపురంపై కంకణదారులతో అర్చకులు కలశ ప్రతిష్ట చేశారు. కలశ ప్రతిష్ట అనంతరం మాతమ్మ తల్లి రాతి విగ్రహాన్ని గర్భాలయంలో పీఠంపై అర్చకులు శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. మాతమ్మతల్లి ప్రతిష్ట తరువాత కంకణదారులు హోమగుండం చుట్టూ ప్రదక్షణ చేసి పూర్ణాహుతి సమర్పించారు.

మహోత్సవంలో పాల్గొన్న వేణుగోపాల్ రెడ్డి

ఒంటిమిట్ట మండల కేంద్రంలోని అరుంధతి కాలనీలో నిర్వహించిన మాతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆయనకు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ


గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

రామాపురం: భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ ఏర్పాటు చేశామని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణావతి పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి పంచాయితీ పొత్తుకూరుపల్లిలో శుక్రవారం భూ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ పొత్తుకూరిపల్లి గ్రామంలో ఇటీవల సర్వే నంబర్ 842లో 26 ఎకరాలు సర్వే చేశామని తెలిపారు. రీ సర్వేతో ఎలాంటి భూ సమస్యలు ఉన్న సభ దృష్టికి తీసుకురావాలని, సమస్యను పరిష్కరించడానికి రెవిన్యూ అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన



బ్యాంక్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ సాయినాథ్

చిన్నమండెం : మండలంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో విద్యార్థులకు బ్యాంక్ వ్యవహారాలపై ఏపీ మోడల్ స్కూల్, కాలేజ్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వృత్తి విద్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ శిక్షణలో భాగంగా ట్రైనర్ చింతల సాయినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ సాయినాథ్ బ్యాంకింగ్ వ్యవస్థపై, ఖాతా ఎలా తెరవాలి, డిపాజిట్స్, నగదు ఎలా జమ చేయాలి, నగదు విత్‌డ్రాలు ఎలా చేయాలో విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయచోటి అర్బన్: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎం హెచ్ఓ డాక్టర్ కొండయ్య సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ పరిధిలోని ఎస్టీ కాలనీలో వైద్య ఆరోగ్యశాఖ తరఫున నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా ఏంటమాలాజికల్ కన్సల్టెంట్ కొండారెడ్డి, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, డీపీఎంఓ రియాజ్‌లతో కలసి కాలనీలో దోమల లార్వా నివారణకు వైద్యసిబ్బంది నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. నీరు నిల్వ ఉండే డ్రమ్ములు, రోళ్లు, నీటి తొట్టెలు, కుండలు, కూలర్స్‌లను పరిశీలించి దోమల లార్వా నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల బారినపడకుండా దోమతెరలు వాడాలని పేర్కొన్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలని కోరారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, అనురాధ, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతులు మంజూరు

సిద్దవటం: గ్రామాల్లో మురుగు నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ కాకుండా సామాజిక ఇంకుడు గుంతల (కమ్యూనిటీ సోక్‌పిట్) నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాల్లో డ్రైనేజీలకు ఇరువైపులా సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఉపాధిహామీ పథకంలో వీటి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. సిద్దవటం మండలానికి 1,000 ఇంకుడు గుంతలు మంజూరు చేశారని ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు తెలిపారు. సిద్దవటంలోని ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో నీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరూ ఇంకుండు గుంతలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు చేస్తామని పేర్కొన్నారు.

తహసీల్దార్ కోసం రైతుల ఎదురుచూపు


తహసీల్దార్ కోసం ఎదురు చూస్తున్న రైతులు

సుండుపల్లె: భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రామ సభలు సుండుపల్లెలో తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం మండల పరిధిలోని భాగంపల్లెలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో అధికారుల కోసం రైతులు ఎదురు చూడాల్సి వచ్చింది. రీ సర్వేలో జరిగిన తప్పులను సవరించడంలో భాగంగా భాగంపల్లెలో గ్రామసభ ఏర్పాటు చేశారు. శుక్రవారం 11.30 గంటలకు కూడా తహసీల్దార్ దైవాదీనం గ్రామసభకు హాజరు కాకపోవడం గమనార్హం. గ్రామసభకు మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, గ్రామ రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, గ్రామ సర్వేయర్లు సమయానికి హాజరయ్యారు. గ్రామసభకు వచ్చిన రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి వెళ్తే సారొస్తారు ఉండండంటూ వీఆర్ఓ, సర్వేయర్ కూర్చోపెట్టారు. 11.40 గంటలకు గ్రామ సభకు వచ్చిన తహసీల్దార్ ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. పేరుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ అక్బర్ అలీ

గాలివీడు : సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ అక్బర్ అలీ కోరారు. ఓపెన్ స్కూల్ నిర్వహణపై సంబంధిత గాలివీడు బాలుర మరియు బాలికల ఉన్నత పాఠశాల అడ్మిషన్లపై శుక్రవారం ఆయన సమీక్షించారు. 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవతరగతి మరియు ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు వేల అడ్మిషన్లు పూర్తి అయ్యాయని, ఈ సంఖ్య మరింత పెంచేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ 200 రూపాయల అపరాధ రసుంతో ఈనెల 26వ తేదీ నుంచి 29వ తారీకు వరకు, 500 రూపాయలు అపరాధ రుసుంతో ఈ నెల 30, 31 తేదీలలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గాలివీడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వర రాజు, మొహిద్దీన్ బాషా, కోఆర్డినేటర్ నాగరాజు, మహేశ్వరయ్య, మధుమతి, శివానంద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.